క్లుప్తంగా

'కేశవరెడ్డి' విద్యార్థి ప్రతిభ


అరవింద్

కర్నూలు(రూరల్): నెల్లూరు జిల్లాలో గత నెల 8, 9 తేదీలలో జరిగిన మస్తానయ్య చెస్ వరల్డ్ ఓపెన్ ఫిడే రాపిడ్ రేటింగ్ టోర్నమెంట్‌లో తమ స్కూల్ విద్యార్థి ఎస్ అరవింద్ ప్రతిభ చాటాడని నగరంలోని వెంకటరమణ కాలనీ కేశవరెడ్డి స్కూల్ కరస్పాండెంట్ కేశవరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రేటింగ్స్- 1113 సాధించినందుకు అరవింద్‌ను యాజమాన్యం అభినందించారు.

పెద్దాసుపత్రికి కొత్త సీటీ స్కాన్

కర్నూలు(హాస్పిటల్): స్థానిక ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త సీటీ స్కాన్ మిషన్‌ను మంజూరు చేసింది. తోషిబ కంపెనీకి చెందిన ఈ మిషన్ 16 స్లైసెస్ సామర్థ్యమున్న ఈ నూతన యంత్రాన్ని కొత్తగా నిర్మించిన డయాగ్నోస్టిక్ బ్లాక్‌లో ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం ఈ యంత్రంతో ట్రయల్ రన్ నిర్వహిస్తున్నారు. మరికొద్ది రోజుల్లో దీనిని రోగులకు అందుబాటులోకి తీసుకురానున్నారు. యంత్రంతో పాటు మూడు అల్ట్రా సౌండ్ మిషన్లు, ఒక మొబైల్ ఎక్స్‌రే యూనిట్‌ను సైతం ప్రభుత్వం ఆసుపత్రికి పంపింది.

హిందువులపై దాడిని ఖండించాలి


కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న వీహెచ్‌పీ, భజరంగ్ దళ్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): హరియాణాలోని మేవాత్‌లో హిందువులపై జరిగిన ఉగ్ర దాడిని ప్రతి ఒక్కరూ ఖండించాలని వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ కోరారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట విశ్వ హిందూ పరిషత్-భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో హరియాణాలో శోభా యాత్రపై దాడి చేసిన ఇస్లాం జిహాదీ మూకలను కఠినంగా శిక్షించాలని కోరుతూ నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లా డుతూ ప్రతి సంవత్సరం శ్రావణ మాసంలో సోమవారం భక్తులు మేవాత్‌లోని మహాభారత కాలం నాటి ఐదు ఆలయాలను సందర్శిస్తూ శంకరుడి ఆశీస్సుల కోసం శోభాయాత్ర నిర్వహిస్తారన్నారు.దాదాపు 25 వేల మంది పాల్గొ న్న యాత్రపై ఉగ్రవాదులు దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. కార్యక్రమంలో నాయకులు మహేష్, గోవిందరాజులు, శివప్రసాదు, రాజేష్, రామకృష్ణ పాల్గొన్నారు.

సేవలు అమోఘం


డాక్టర్ నరేంద్రనాథరెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే కాటసానిని సత్కరిస్తున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): ఆస్పత్రికి సూపరింటెండెంట్‌గా డాక్టర్ నరేంద్రనాథరెడ్డి అందించిన సేవలు అమోఘమని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.ప్రభాకర్‌రెడ్డి కొనియాడారు. పదవీ విరమణ చేసిన డాక్టర్ నరేంద్రనాథరెడ్డిని వ్యవసాయ మార్కెట్ యార్డులోని సమావేశ మందిరంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే రాంభూపాల్‌రెడ్డిని కూడా మార్కెట్ కమిటీ చైర్మన్ సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సెక్రటరీ గోవిందు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌సీపై నిర్లక్ష్యం తగదు


విద్యుత్ భవన్ వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టిన విద్యుత్ ఉద్యోగులు

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ ఉద్యోగులకు 2022 పీఆర్‌సీ అమలు చేయడంలో యాజమాన్యం నిర్లక్ష్యం వహించడం తగదని విద్యుత్ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ గణేష్ అన్నారు. బుధవారం జేఏసీ ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్ భవన్ ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని వివిధ రూపాల్లో ఆందోళన చేస్తున్నప్పటికీ ఉన్నతాధికారులు స్పందించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ లక్ష్మీకాంత్‌రెడ్డి, కార్యదర్శి రంగస్వామి, ఇతర సంఘాల నాయకులు గంగన్న, బెళగల్ ఉసేని, ఎస్ కృష్ణయ్య, పీవీ రామరాజు, సయ్యద్ బాషా, శివకుమార్ పాల్గొన్నారు. కాగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి విద్యుత్ ఉద్యోగుల దీక్షలకు మద్దతు ప్రకటించారు.

నైపుణ్యంతో రాణించాలి

కర్నూలు (టౌన్): వార్డు సచివాలయాల్లో పని చేసే ఉద్యోగులు వృత్తి నైపుణ్యంతో రాణించాలని నోడల్ అధికారి రామలింగేశ్వర్ సూచించారు. బుధవారం కొత్త బస్టాండ్ మార్కెట్ యార్డు సీతారామనగర్ సచివాలయంలో ఏర్పాటు చేసిన సచివాలయ కార్యదర్శుల శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడుతూ స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు సాధించాలన్నారు. సమావేశంలో మేనేజర్ చిన్నరాముడు, రెవెన్యూ అధికారి జునీద్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

- కర్నూలు ఎమ్మెల్యే ఎంఏ హఫీజ్‌ఖాన్


అంగన్‌వాడీ కేంద్రంలో రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

కర్నూలు(రాజ్‌విహార్): పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని, అందుకే గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని కర్నూలు ఎమ్మెల్యే ఎంఏ హఫీజ్‌ఖాన్ అన్నారు. ఇంటి వద్దకే రేషన్ సరుకులు, వైఎస్ఆర్ న్యూట్రిషియన్ కిట్‌ను అందజేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బుధవారం అమరావతిలోని సీఎం క్యాంపు కార్యాలయం నుంచి ప్రారంభించారు. స్థానిక బుధవారపేటలోని చెట్టు కింద బడి అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ పాల్గొని మాట్లాడారు. గర్భిణులు, బాలింతల్లో పోషకాహార లోపం, రక్తహీనత నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఎన్నడూలేని విధంగా నాణ్యమైన రేషన్ సరుకులు, పౌష్టికాహార లోపం నివారించేందుకు వైఎస్ఆర్ న్యూట్రిషన్ సరుకులు అందజేస్తున్నట్లు తెలిపారు. వీటిని పొందేందుకు అంగన్‌వాడీ కేంద్రాలకు రాలేని గర్భిణులు, బాలింతలకు ఇంటి వద్దకే చేర్చేందుకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ప్రభుత్వ మెనూ ప్రకారం ఒక్కో గర్భిణీ, బాలింతకు నెల (25రోజులు)కు మూడు కేజీల బియ్యం, కేజీ కందిపప్పు, వంట నూనె 500ఎంఎల్, వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కింద పౌష్టికాహార కిట్‌లో భాగంగా రాగి పిండి-2కేజీలు, అటుకులు-కేజీ, ఖర్జూర పండ్లు 250 గ్రాములు, చిక్కీలు 250 గ్రాములు, బెల్లం 250 గ్రాములు, పాలు 25 లీటర్లు, గుడ్లు 25 చొప్పున బ్యాగులో పెట్టి అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు శ్రీరాములు, వైఎస్సార్‌సీపీ నాయకులు కేదార్‌నాథ్, మంజులత, క్రాంతి, పవన్, ఐసీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.

పథకాలతో ఆర్థికంగా ఎదగండి

కర్నూలు(రాజ్‌విహార్): సంక్షేమ పథకాలు పొంది ఆర్థికంగా ఎదగాలని ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ సూచించారు. బుధవారం ఆయన స్థానిక 5వ వార్డులో మున్సిపల్, సచివాలయ సిబ్బందితో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గడ్డ వీధి ఈద్గా, చిత్తరి వీధి ప్రాంతంలో ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదలను ఆర్థిక కష్టాల నుంచి గట్టెక్కించేందుకే సంక్షేమ పథకాలు తెచ్చారన్నారు. వీటిని అర్హులైన ప్రతి కుటుంబం పొంది ఆర్థికంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సుజాత, పార్టీ నాయకులు శేషుయాదవ్, హజ్ కమిటీ సభ్యుడు మౌలానా మంజూర్, నాయకులు అక్బర్ అలీ, మహబూబ్ బాషా, మక్బూల్, అబ్దుల్లా, కార్యకర్తలు పాల్గొన్నారు.


పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే

విస్తృత తనిఖీలు

కర్నూలు (న్యూసిటీ): సీ క్యాంప్, కొత్త బస్టాండ్, రాజ్‌విహార్ ప్రాంతాల్లోని కిరాణం, కూల్‌డ్రింక్స్ షాపుల్లో బుధవారం తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ పీవీఎం పరమేశ్వర కుమార్ తనిఖీలు నిర్వహించారు. తూకాల్లో వ్యత్యాసం, సరైన వివరాలు ముద్రించకపోవడాన్ని గుర్తించి రెండు దుకాణాల యజమానులపై కేసులు నమోదు చేశారు. నాణ్యమైన సరుకులు, వస్తువులు విక్రయించాలని వ్యాపారులను సూచించారు. నిబంధనలకు వ్యతిరేకంగా వ్యాపారం చేస్తే లైసెన్స్ రద్దు చేసి, కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

మద్యంతో పట్టుబడిన మట్కా బీటర్

కర్నూలు: బుధవారపేటకు చెందిన మట్కా బీటర్ సయ్యద్ అబ్దుల్ ఫరీద్ తెలంగాణ మద్యం విక్రయిస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. మట్కా నిర్వహణపై కొంతకాలంగా పోలీసులు దాడులు నిర్వహిస్తుండటంతో ప్రత్యామ్నాయఉపాధి కోసం సయ్యద్ అబ్దుల్ ఫరీద్ తెలంగాణ నుంచి మద్యం తీసుకువచ్చి వ్యాపారం చేస్తున్నట్లు సమాచారం అందడంతో బుధవారం మధ్యాహ్నం మూడో పట్టణ సీఐ మురళీధర్‌రెడ్డి ఆదేశాల మేరకు పోలీసులు దాడి చేశారు. హబీబ్ ముబారక్ నగర్ హంద్రీ నది ఒడ్డు పక్కన సయ్యద్ అబ్దుల్ ఫరీద్ మద్యం విక్రయిస్తుండగా దాడి చేసి ఆరు మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకుని విక్రేతను అరెస్టు చేశారు. అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

దూర విద్యతో ఎంతో మేలు


పోస్టర్లను విడుదల చేస్తున్న జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(సెంట్రల్): విద్యకు దూరమైన వారికి, ఉన్నత విద్యను చదవాలనుకునే వారికి దూర విద్య ఎంతో మేలని జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య అన్నారు. బుధవారం ఆమె తన కార్యాలయంలో ఏపీ సార్వత్రిక విద్యా పీఠం(దూర విద్యా విధానం) రూపొందించిన కరపత్రాలు, పోస్టర్లను డీఈఓ రంగారెడ్డితో కలిసి ఆవిష్కరించారు. పది, ఇంటర్ చదవలేక మధ్యలోనే మానేసిన వారు దూర విద్యతో ఉన్నత విద్యకు దగ్గర కావచ్చన్నారు. పది, ఇంటర్‌లో చేరడానికి అడ్మిషన్లు జరుగుతున్నాయని, అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అర్థమయ్యే రీతిలో బోధన చేయాలి


మాట్లాడుతున్న కరీమా అంజుమ్

కర్నూలు(సెంట్రల్): పిల్లల మానసిక, శారీరక, సామాజిక అంశాలను దృష్టిలో ఉంచుకుని వారికి అర్థమయ్యే రీతిలో బోధన చేయాలని బెంగళూరుకు చెందిన రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ సభ్యురాలు కరీమా అంజుమ్ సూచించారు. బుధవారం సిల్వర్ జూబ్లీ బీఈడీ కాలేజీలో ఇంటరాక్టివ్ టీచింగ్ అండ్ యాక్టివ్ లెర్నింగ్ స్ట్రాటజీస్ ఫర్ టీచర్‌ట్రైనీస్ అంశంపై రెండు రోజుల జాతీయస్థాయి వర్క్ షాపులో ఆమె మాట్లాడారు. ఛాత్రోపాధ్యాయులు బోధనలో వృత్తి నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. బోధనోపకరణాలు, సాంకేతికత, సామాజిక అంశాలను జోడించి బోధన చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆర్.ఆదినారాయణరెడ్డి, సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీఎస్ కుమార్, పురుషుల ప్రభుత్వ డిగ్రీ కాలేజీ కెమిస్ట్రీ అధ్యాపకుడు ఏ.సత్యనారాయణ పాల్గొన్నారు.

తొలిసారిగా బేరియాట్రిక్ సర్జరీ

కర్నూలు(హాస్పిటల్): అధిక బరువుతో బాధపడుతున్న నంద్యాల జిల్లాకు చెందిన బాలాజీకి బేరియాట్రిక్ సర్జరీ చేసిదాదాపు 17 కిలోలు తగ్గించినట్లు స్థానిక జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ వి. సురేష్‌కుమార్‌రెడ్డి, ల్యాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ ఎం.బాలమురళి తెలిపారు. బుధవారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ 45 ఏళ్ల బాలాజీ 107 కిలోల బరువు ఉండటంతో స్థూలకాయం, బీపీ, షుగర్, స్ట్రోక్ సమస్యలతో బాధ పడుతూ తమ ఆస్పత్రికి వచ్చాడన్నారు. అతనికి బేరియాట్రిక్ సర్జరీ చేసి, 90 కిలోలకు తగించామన్నారు. అతనిలో గ్రెలిన్, లెప్రిన్ హార్మోన్ల నియంత్రణ జరిగి మరి కొద్దిరోజులకు 75 కిలోలకు వచ్చాడన్నారు. అతని జీర్ణవ్యవస్థలో మార్పు తీసుకురావడంతో పాటు పొట్టపరిమాణాన్ని కూడా తగ్గించామన్నారు. ఇలాంటి సర్జరీ రాయలసీమలోనే మొదటిది అన్నారు. సమావేశంలో హాస్పిటల్ ఎండీ డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ ఆదిత్య, జనరల్ మేనేజర్ నదీమ్ పాల్గొన్నారు.

ముస్లింలకు బీజేపీ వ్యతిరేకం కాదు

- మోదీ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు మేలు
- బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బాజ్జీ


కరపత్రాలు విడుదల చేస్తున్న షేక్‌బాజ్జీ, తదితరులు

కర్నూలు(సెంట్రల్): భారతీయ జనతా పార్టీ ముస్లింలకు వ్యతిరేకం కాదని, ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలనలో అన్ని వర్గాలకు మేలు జరుగుతోందని, అందులో లబ్ధిపొందిన వారిలో ముస్లింలు కూడా ఉన్నారని ఆ పార్టీ మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బాజ్జీ అన్నారు. బుధవారం ఆయన బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నరేంద్రమోదీ 9 ఏళ్ల పాలనలో ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి పేదరికాన్ని రూపుమాపేందుకు చర్యలు తీసుకున్నారన్నారు. ఏపీ, తెలంగాణలలో ఓట్ల రాజకీయాల కోసం ముస్లింలకు బీజేపీ వ్యతిరేకమనే తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. అందులో ఎలాంటి నిజం లేవన్నారు. కేంద్ర ప్రభుత్వం పంచాయతీలకు విడుదల చేస్తున్న నిధులను రాష్ట్రాలు పక్కదోవ పట్టిస్తున్నాయని, ఇదే విషయమై ఈనెల 10న సర్పంచ్‌ల ఆధ్వర్యంలో అన్ని జిల్లాల్లో ఆందోళనలు చేస్తామని చెప్పారు. అనంతరం మైనార్టీ మోర్చా ముద్రించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి

కోడుమూరు రూరల్: మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, జగనన్న కాలనీల్లోని ఇండ్ల నిర్మాణాలపై మండల స్పెషలాఫీసర్, సాంఘిక సంక్షేమ శాఖ జేడీ రంగాలక్ష్మీదేవి బుధవారం మండల అధికారులతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో వివిధ దశల్లో ఉన్న గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకేలు, హెల్త్ సెంటర్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్లు మంజూరై నిర్మాణాలు మొదలు పెట్టుకోని లబ్ధిదారులతో మాట్లాడి త్వరగా నిర్మాణాలు ప్రారంభించుకునేలా చూడాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంఈఓ శరభయ్య, హౌసింగ్ ఏఈ లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే వేటు తప్పదు

కర్నూలు (న్యూటౌన్): వీఆర్‌ఓలు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే వేటు తప్పదని కర్నూలు రూరల్ తహసీల్దార్ ఆర్ శివరాముడు హెచ్చరించారు. బుధవారం సాయంత్రం కర్నూలు రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సమస్యలు, ఓటర్ల ఇంటింటి సర్వేపై వీఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్పందనలో వచ్చే వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో మంది రైతులు వివిధ సమస్యలతో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని, వారి సమస్యలను పరిష్కరిస్తే ఎంతో సంతోషిస్తారని చెప్పారు. స్పందనలో వచ్చిన ప్రతి సమస్యకు పరిష్కారం చూపాల్సిన బాధ్యత వీఆర్‌ఓలదేనని అన్నారు. సమావేశంలో డీటీ సాహెరాబాదు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

చిన్నారులకు సమయానుసారం టీకాలు వేయాలి

కర్నూలు (న్యూటౌన్): చిన్నపిల్లలందరికీ సమయానుసారం టీకాలు వేయాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ ఏఎన్‌ఎంలను ఆదేశించారు. బుధవారం కర్నూలు మండలం ఈ తాండ్రపాడు పీహెచ్‌సీలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ చిన్నపిల్లలందరికీ రోట, ఎంఆర్1, ఎంఆర్2 వ్యాక్సిన్‌లు వందశాతం పూర్తి చేయాలని అన్నారు. గర్భిణులకు కాన్పుకు వెళ్లాల్సిన ఆసుపత్రిని ముందుగానే గుర్తించి ఆ వివరాలను ఎంసీపీ కార్డు, ఏఎన్‌ఎం యాప్, ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. అనంతరం జగనన్న సంపూర్ణ పోషణ కిట్స్‌ను గర్భిణులకు, బాలింతలకు పంపిణీ చేసి, చిన్నపిల్లలకు అన్నప్రాశన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ విజయమాధురి, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నవరత్నాలే విజయానికి పునాదులు

- వైఎస్సార్‌సీపీ కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు కాటసాని, రామయ్య
- నాడు చంద్రబాబుకు సీట్లు ఇవ్వలేదని సీమపై నిర్లక్ష్యం
- నేడు వైఎస్ జగన్ హయంలో సీమ సస్యశ్యామలం


బుక్‌లెట్ అందజేసి సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మేయర్ రామయ్య

కల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాలే వైఎస్సార్‌సీపీ విజయానికి పునాదులని వైఎస్సార్‌సీపీ జిల్లాల అధ్యక్షులు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మేయర్ బీవై రామయ్య అన్నారు.బుధవారం కల్లూరు అర్బన్ 19వ వార్డు నాల్గవ తరగతి ఉద్యోగుల కాలనీ, రాంనగర్ కాలనీల్లో గడప గడపకు మన ప్రభుత్వంకార్యక్రమం కొనసాగింది. సందర్భంగా ఎమ్మెల్యే, మేయర్ ఆయా కాలనీలో విస్తృతంగా పర్యటిస్తూ సంక్షేమ పథకాలను వివరిస్తూ బుక్‌లెట్లను పంపిణీ చేశారు.

రాయలసీమపై నిర్లక్ష్యం

టీడీపీ అధినేత చంద్రబాబు తాను పుట్టిన రాయలసీమకు తన 14 ఏళ్ల పాలనలో చెప్పుకోదగ్గ ఒక్క పని చేయలేదని బీవై మేయర్ రామయ్య దుయ్యబట్టారు. నాడు చంద్రబాబు రాయలసీమపై నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. 2014 ఎన్నికల్లో రాయలసీమ జిల్లాలో సీట్లు రాలేదనే ఏకైక కారణంతో సీమపై నిర్లక్ష్యం ప్రదర్శించారని మండిపడ్డారు. ఇప్పుడు ఏ ముఖం పెట్టుకొని సీమకు వచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. రాబోయ్యే ఎన్నికల్లో టీడీపీ రాయలసీమలో డిపాజిట్లు గల్లంతవ్వడం ఖాయమన్నారు.

నేడు సీమ సస్యశ్యామలం

ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ రాయలసీమపై చంద్రబాబు చిన్నచూపు చూసినందుకే గత ఎన్నికల్లో టీడీపీ ముచ్చటగా మూడు సీట్లతో ప్రజలు సరిపెట్టారన్నారు. నాడు టీడీపీ హయంలో కరువుకు కేరాఫ్‌గా రాయలసీమను మార్చగా, నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సకాలంలో వర్షాలు కురుస్తూ సస్యశామలంగా ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ మద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

హర్షవర్ధన్ మృతి తీరని లోటు

కర్నూల్(రూరల్): తమ కళాశాల హ్యాండ్‌బాల్ క్రీడాకారుడు హర్షవర్ధన్(23) మృతి తీరని లోటు అని ఉస్మానియా కళాశాల ప్రిన్సిపాల్ సమీఉద్దీన్ ముజ్జామ్మిల్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రకాశం జిల్లా కోటపాడుకు చెందిన హర్షవర్ధన్ నగరంలోని సాయి(క్రీడా వసతి గృహం)లో ఉండి బీఏ మూడో ఏడాది చదువుతూ రాష్ట్ర, జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో రాణించాడన్నారు. అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనడమే లక్ష్యంగా సాధన చేస్తూ సోమవారం మృతి చెందడం బాధాకరమన్నారు.

గిరిజనులను వీసీ పోస్టుల్లో నియమించాలి

కర్నూలు (అర్బన్): రాష్ట్రంలో త్వరలో భర్తీ చేయనున్న యూనివర్సిటీల వీసీల పోస్టుల్లో అర్హులైన, అనుభవమున్న గిరిజనులను నియమించాలని టీఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షులు కె.అక్కులప్ప, రాష్ట్ర అధ్యక్షులు రాగిరి చంద్రప్ప కోరారు. బుధవారం వారు విజయవాడలో ఉన్నత విద్యా మండలి చైర్మన్ హేమచంద్రారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు.

అక్రమ ప్రాజెక్టులను అడ్డుకోవాలి

కర్నూలు(సెంట్రల్): కర్ణాటకలోని ఎగువ ప్రాంతంలో నిర్మిస్తున్న అప్పర్‌భద్ర, నవలీ అక్రమ ప్రాజెక్టులను అడ్డుకోవాలని రాయలసీమ స్టీరింగ్ కమిటీ అధ్యక్షుడు బైరెడ్డి రాజశేఖరరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల ఢిల్లీలో నిర్వహించిన దీక్షకు ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. సిద్ధేశ్వరం వద్ద కృష్ణానందిపై తీగల వంతెనకు బదులుగా బ్యారేజీ నిర్మించాలని డిమాండ్ చేశారు. కేఆర్ఎంబీని కర్నూలులో పెట్టిన తరువాత బీజేపీతో ఏ పార్టీ అయినా పొత్తు పెట్టుకోవాలని డిమాండ్ చేశారు. జీఓ నంబర్ 69తో రాయలసీమ కొంప కొల్లేరు అవుతుందని, త్వరలోనే రాయలసీమ హక్కుల రక్షణ కోసం డోన్ నుంచి రాయలసీమ రచ్చబండ కార్యక్రమాన్ని ప్రారంభిస్తానని ఆయన వివరించారు.

రెండు చోట్ల అగ్ని ప్రమాదం

కర్నూలు(రూరల్): నగరంలో బుధవారం రెండు చోట్ల అగ్ని ప్రమాదం జరిగినట్లు అగ్నిమాపక శాఖ జిల్లా ఉప అధికారి (ఏడీఎఫ్ఓ) చిన్న బజారి ఒక ప్రకటనలో తెలిపారు. చాణిక్యపురి కాలనీలోని మెగా అపార్ట్‌మెంట్‌లో ఏసీలో నుంచి పొగలు రావడంతో ఇంటి యజమాని గమనించి తమకు సమాచారం అందించాడని, కల్లూర్ ఎస్టేట్ ఆదిత్య నగర్‌లోని మీనాక్షి బయో ఆయిల్‌లో పొట్టుకు నిప్పు పెట్టడంతో మంటలు వ్యాపించడంతో స్థానికులు తమకు సమాచారం ఇచ్చారని తెలిపారు. వెంటనే ఆయా చోట్లకు తమ సిబ్బంది నరసింహ, సుధాకర్, వెంకటేశ్వర్లు, మల్లేష్, విజయ్ కుమార్, మహేశ్వర నాయుడుతో కలిసి మంటలను అదుపు చేశామన్నారు.

'ఆడుదాం ఆంధ్ర' మస్కట్, లోగో తయారీకి దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(రూరల్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించబోతున్న ఆడుదాం ఆంధ్ర పోటీలకు మస్కట్, లోగో తయారు చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సీఈఓ రమణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉత్తమ మస్కట్, లోగో తయారు చేసిన వారికి ప్రథమ బహుమతిగా రూ.50,000, ద్వితీయ బహుమతిగా 30,000, తృతీయ బహుమతిగా రూ.20,000 ఇవ్వనున్నట్లు చెప్పారు. జిల్లాలోని పాఠశాల, కళాశాల, యూనివర్సిటీల విద్యార్థులు మస్కట్, లోగోను తయారు చేసి 7న తేదీలోపు http://spors.ap.gov.in వెబ్‌సైట్‌కు పంపించాలన్నారు.

కుక్కల దాడిలో గొర్రెలు, మేకలకు గాయాలు


గాయపడిన గొర్రె, మేక పిల్లలు

ఆదోని రూరల్ : మండలంలోని పాండవగల్లు గ్రామంలో బుధవారం కుక్కల దాడిలో ఎనిమిది గొర్రె పిల్లలు, ఏడు మేక పిల్లలు తీవ్రంగా గాయపడ్డాయి. బాధితుడు చింతకుంట నరసయ్య తెలిపిన వివరాల మేరకు..గొర్రెలు, మేకలను మేపడానికి అడవులకు తీసుకెళ్లగా, వాటికి సంబంధించిన పిల్లలను కంచె వేసిన ప్రదేశంలో ఉంచి వెళ్లగా రెండు కుక్కలు ప్రవేశించి దాడి చేసి గాయపరిచాయన్నారు. దీంతో 15 గొర్రె, మేక పిల్లలు తీవ్రంగా గాయపడ్డాయని కన్నీటి పర్యంతమయ్యారు.

పాముకాటుతో యువతికి అస్వస్థత

ఆదోనిఅర్బన్ : ఆస్పరి గ్రామానికి చెందిన బాలుసాబ్ కుమార్తె జీనత్ అనే యువతిని బుధవారం పాము కాటు వేయడంతో అస్వస్థతకు గురైంది. వెంటనే బంధువులు ఆదోని ఏరియా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఉదయం పొలానికి వెళ్లిన సమయంలో అక్కడ పాము కాటు వేసిందని, ఆసుపత్రిలో యువతి కోలుకుంటుందని చెప్పారు.

గర్భిణిపై కూలిన కాంపౌండ్ గోడ


గర్భిణి నాగమ్మను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం


కుడి చెయ్యి విరగడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలిక శేషమ్మ

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని గుడేకల్ గ్రామంలో బుధవారం ఉదయం ఇంటి ముందు కూర్చున్న బోయ లక్ష్మన్న కుమార్తెలు నాగమ్మ (23), శేషమ్మలపై కాంపౌండ్ గోడ కూలి పడింది. ఇంటి ముందు గేటు ఏర్పాటు చేసుకున్న కాంపౌండ్ గోడ గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు బాగా తడిసి నెమ్ము తీసుకుంది. ఉదయం అక్కాచెల్లెలు గేటు ముందు కుర్చుని ఉండగా వీరిపై కూలి పడింది. మూడు నెలల గర్భిణి నాగమ్మ నడుముపై పడటంతో తీవ్ర రక్తస్రావం కాగా, శేషమ్మకు కుడి చెయ్యి విరగడంతో పాటు తలకు గాయాలయ్యాయి. వీరిని చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు.

ఎడ్ల బండిని ఢీకొన్న జీపు

వెల్దుర్తి: నిద్రమత్తులో జీపు డ్రైవింగ్ చేస్తూ ఎదురుగా వస్తున్న ఎద్దుల బండిని ఢీకొట్టాడు గుర్తు తెలియని వ్యక్తి. బుధవారం తెల్లవారుజామున హైవే-44పై ఈ సంఘటన జరిగింది. వివరాలు.. పట్టణంలోని 2వ వార్డుకు చెందిన రైతు ఏనుగుల నాగేశ్వరరెడ్డి మదార్‌పురం వైపు గల పొలానికి వెళ్లేందుకు ఎడ్ల బండితో బయలుదేరాడు. డోన్‌వైపు గేట్లు దాటి జాతీయ రహదారి అవతలి వైపు చేరుకుని రహదారి పక్కనుంచి వెళుతున్నాడు. అదే సమయంలో ఎదురుగా కర్నూలు వైపు వెళ్తున్న టెంపో జీపు రహదారి దిగి ఎద్దులబండి కాడిమానును ఢీకొట్టుకుంటూ వెళ్లింది. కాడిమాను, రైతు కూర్చునే ప్రాంతం ధ్వంసం కాగా, ఎద్లు గాయపడ్డాయి. తేరుకున్న జీపు డ్రైవర్ కర్నూలు వైపు పరారయ్యాడు. రైతు స్థానిక పోలీసులను ఆశ్రయించగా ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి విచారణ చేపట్టారు. అమకతాడు టోల్‌గేట్ నుంచి జీపు వెళ్లినట్లు గుర్తించారు. స్థానిక వెటర్నరీ డాక్టర్ శాంతలత ఎద్దులకు చికిత్స అందించారు.

శతాధిక వృద్ధురాలు మృతి


కారుమూరు హనుమక్క (ఫైల్)

మద్దికెర: బురుజుల గ్రామానికి చెందిన కారుమూరు హనుమక్క (105) అనే శతాధిక వృద్ధురాలు బుధవారం మృతి చెందింది. మృతురాలి కుమారుడు ప్రకాష్‌రెడ్డి, మనవడు సింగిల్ విండో మాజీ చైర్మన్ తమ్మిరెడ్డి మాట్లాడుతూ.. చనిపోయేంత వరకు కంటికి అద్దాలు లేకుండా సొంతంగా పనులు చేసుకునేదని, అలాగే విత్తనాలలో రాళ్లు ఏరివేసేదన్నారు. ఎలాంటి జ్వరం గానీ, అనారోగ్యం గానీ లేదని ఆరోగ్యంగా ఉండేదన్నారు. ఆమె మృతి విషయం తెలిసిన వెంటనే వైఎస్సార్‌సీపీ నాయకులు భరత్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు సుబ్బయ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.